క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో - 2 రవీంద్ర

లింగపాలెం : పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనం విషయంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈవో–2 జె రవీంద్ర అన్నారు. గురువారం ఆయన పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు పాఠశాలల రికార్డులు, విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు అందించే రైస్‌లో పోర్టిఫైడ్ రైస్ కలిపి అందిస్తుందని దీనివలన పోషక విలువలు కల్గి ఉండి, విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా శరీరంపై తెల్లని మచ్చలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు మరింతగా పెరిగేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట సీఆర్‌ఎమ్‌టీ గుడిపూడి కుమార్‌మంగళం ఉన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ

కొయ్యలగూడెం : మండలంలో తిమ్మనకుంట గ్రామంలో గురువారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల మహాసభ సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏలూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జంగారెడ్డిగూడెంలో సంఘం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు, సీపీఐ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయక కార్యదర్శి ఆంజనేయరాజు, కొయ్యలగూడెం పట్టణ కార్యదర్శి ఎస్కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై సతీష్‌కుమార్‌కు అభినందనలు



టి.నరసాపురం ఎస్సై సతీష్‌కుమార్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

టి.నరసాపురం : టి.నరసాపురం ఎస్సైగా పని చేస్తున్న కె.సతీష్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు. ఇటీవల బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెం ఎస్టీ హాస్టల్లో విద్యార్థి మృతి మిస్టరీ ఛేదించడంలో సతీష్‌కుమార్ చేసిన కృషిని గుర్తించి, ఏలూరులో గురువారం ఆయనకు ప్రశంసా పత్రాన్ని ఎస్పీ మేరీ ప్రశాంతి అందజేశారు. విద్యార్థి హత్య కేసును 48 గంటల్లో ఛేదించేందుకు మొత్తం 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయగా, వీరిలో ఎస్సై సతీష్‌కుమార్ కూడా ఉన్నారు.

ఎమ్మెల్యే ఎలీజా పరామర్శ



అయ్యపరాజుగూడెంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : అయ్యపరాజుగూడెంలో వైఎస్సార్ సీపీకి చెందిన బాధిత కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పరామర్శించారు. గ్రామంలో పార్టీకి చెందిన ఐదుగురు వ్యక్తులు చనిపోవడం బాధాకరమన్నారు. వారి మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుపాల రామకృష్ణ, పార్టీ నాయకులు రావి కొండయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

శారద పుష్పావతి సేవలు అభినందనీయం

జంగారెడ్డిగూడెం రూరల్ : ఉద్యోగ విరమణ చేసిన తిరుమలాపురం అంగన్‌వాడీ వర్కర్ కొల్లా శారద పుష్పావతిని గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో మహిళలు, చిన్నారులతో మమేకమై ప్రభుత్వాలు అందించే ప్రతి సేవను ఎంతో శ్రద్ధతో లబ్ధిదారులకు చేర్చి అందరి మన్ననలు పొందిన కొల్లా శారద పుష్పావతి సేవలు అభినందనీయమని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్ షేక్ మేరీ, ఎంపీటీసీ వేముల రత్నకుమారి, కోఆప్షన్ ఎంపీటీసీ షేక్ లాల్‌అహ్మద్, సొసైటీ అధ్యక్షులు రాజులపాటి అన్నవరం, సచివాలయ కార్యదర్శి జగదీష్, ఉప సర్పంచ్ ఎం.శ్రీలక్ష్మీ, మాజీ సర్పంచ్ కేవీఎస్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ద్వారకాతిరుమల: జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పలువురు లబ్ధిదారులకు ఆయన కుల, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు, అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తున్నట్టు తెలిపారు. ఒకప్పుడు ప్రజలు తమ సమస్యలను నివేదించేందుకు అధికారులు, నాయకుల చుట్టూ తిరిగేవారని, అయినా ఎవ్వరూ పట్టించుకునేవారు కాదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనలో అధికారులు, నాయకులు ఇళ్ల వద్దకు వెళ్లి మరీ సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకతను చూపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఎంపీటీసీ జిత్తుక విజయలక్ష్మి, స్థానిక సొసైటీ చైర్‌పర్సన్ చెరుకూరి ప్రసాదరావు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, గుర్రాల లక్ష్మణ్, జిత్తుక శ్రీను, హరికృష్ణ తదితరులున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

టి.నరసాపురం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటున్నారని పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మక్కినవారిగూడెంలో నిర్వహించిన జగనన్న సురక్షలో వారు పాల్గొని మాట్లాడారు. మక్కినవారిగూడెం జమ్మిచెరువును అభివృద్ధి చేయాలని ఆ చెరువు అభివృద్ధి ద్వారా ఐదు గ్రామ పంచాయతీలలోని దాదాపు 20 గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనం చేకూరుతుందని స్థానిక రైతులు కోరారు. ఆ చెరువు అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 625 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను, కౌలు పత్రాలను పంపిణీ చేశారు. సహకార సంఘ చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, సర్పంచ్ ఎం.గోపాలరావు, వైస్ ఎంపీపీ బుర్ల దివ్యభారతి, మందలపు మూర్తి, పిన్నమనేని రాధాకృష్ణ, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎంపీడీవో మంగ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి జగనన్న సురక్ష కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని మైసన్నగూడెంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు, పేరంపేట గ్రామంలో 10.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పాల్గొంటారని వివరించారు.



ద్వారకాతిరుమల : రామన్నగూడెంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నూరుశాతం పథకాలు అందించడమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం : అర్హులైన ప్రతి ఒక్కరికీ నూరుశాతం పథకాలు అందాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 4వ సచివాలయం పరిధిలో రోటరీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ చనమాల శ్రీనివాస్, కౌన్సిలర్ ఉగ్గంప్రసాద్, సంకు సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, కె.శేషారెడ్డి, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వేలేరుపాడు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆర్డీఓ ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం వేలేరుపాడు మండలంలోని పాతపూచిరాల గ్రామంలో పాఠశాల వద్ద జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28 వరకు వేలేరుపాడు మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 286 కుల, ఆదాయ ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ మూర్తి, ఆర్ఐ దుర్గారావు, ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, రేపాకగొమ్ము సర్పంచ్ సోడే వెంకమ్మ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం : లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

గొమ్ముగూడెంలో జగనన్న సురక్ష

కుక్కునూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తున్నట్టు తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర అన్నారు. గొమ్ముగూడెం సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కుల, ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోడే సాధు, వీఆర్‌ఓ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

చింతలపూడి : మండలంలోని శివపురం గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అర్హులకు వివిధ రకాల ధ్రువీకరన పత్రాలు అందజేశారు. అంతకు ముందు గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ నరుకుళ్ళ హరిణి,, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీడీఓ మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసా బేగం ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిగూడెంలో...

చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడెం సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. పథకాలు అందని వారికి కావలసిన సర్టిఫికెట్లు ఉచితంగా అందచేసి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశ్యమని ఆయన అన్నారు. గ్రామంలో మొత్తం 363 మందికి వి. విధ రకాల సర్టిఫికెట్లు అందచేసినట్లు చెప్పారు. సచివాలయాల పట్టణ కన్వీనర్ ఎస్.దుర్గారావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, రామరాజు నాయక్ , అధికారులు పాల్గొన్నారు.



చింతలపూడి : నాగిరెడ్డిగూడెంలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న నగర పంచాయతీ కమిషనర్



వలంటీర్లకు వందనం

కొడుకులా ఆదుకుంటుంది



కృష్ణవంశీ, వెంకటమ్మకు నగదుతో పాటు దుస్తులు అందచేస్తున్న వలంటీర్ రేణుక

నా పేరు వెంకటమ్మ. కూలిపనులకు వెళ్తుంటాను. నేను నా మనవడు కృష్ణవంశీతో కలిసి పోతునూరు గ్రామంలో నివాసం ఉంటున్నాను. నా కోడలు నా కుమారుణ్ణి, తన బిడ్డను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోగా నా కుమారుడు మరో స్త్రీని వివాహం చేసుకున్నాడు. దీంతో మనవడి భారం నామీద పడింది. రాఘవాపురం సచివాలయం – 1 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ పిల్లం రేణుక మేము పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని మా ఇంటికి వచ్చింది. కృష్ణవంశీకి అవసరమైన ధ్రువపత్రాలన్నీ సచివాలయంలో ఇప్పించి కావాల్సిన పుస్తకాలు, బట్టలు ఇప్పించి పాఠశాలలో చేర్పించి సొంత కొడుకులా చూసుకుంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వలంటీర్ రేణుకకు రుణపడి ఉంటాము.

వరదల సమయంలో వారి సేవలు మరువలేం



గతేడాది గోదావరి వరదల కారణంగా మండలంలో దాదాపు అన్ని గ్రామాలు ముంపునకు గురై వేలాది సంఖ్యలో గ్రామస్తులు పునరావాస సహాయక శిబిరాలలో తలదాచుకున్నారు. వరద ముంపు ప్రారంభమైంది మొదలు పునరావాస కాలనీలకు తరలించడం, సహాయక కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వారికి పాలు, నీరు, బియ్యం, కూరగాయలు తదితర నిత్యావసరాలను వలంటీర్‌లు పంపిణీ చేశారు. వలంటీర్‌ల కుటుంబాలు వరద నీటిలో చిక్కుకున్నా వారి కుటుంబాలను వదిలి పునరావాస కేంద్రాలకు పడవలలో ప్రయాణించి మరీ వారికి కేటాయించిన 50 ఇళ్లకు ప్రతి ఒక్కటి అందేలా చూశారు. ఆ సమయంలో వలంటీర్‌లు అందించిన సేవలను బాధితులెవ్వరం మరువలేం. మా వలంటీర్ వెంకటరమణ అర్ధరాత్రి ఫోన్ చేసిన వెంటనే స్పందించి సేవలందిస్తాడు. అతను అందించిన సేవలకు బెస్ట్ వలంటీర్ అవార్డు కూడా వచ్చింది.

– వినపాల ప్రభాకర్, రామాలయం సెంటర్, కుక్కునూరు

మా కుటుంబంలో ఒకడు



వలంటీర్ వ్యవస్థ వచ్చిన నాటి నుంచి మద్దిపాటి రవికుమార్ (కిషోర్) అనే వలంటీర్ మా కుటుంబంలో ఒకడిగా కలిసిపోయాడు. మా కుటుంబానికి రైతు భరోసా, అమ్మ ఒడి, వృద్ధాప్య పింఛన్, వైఎస్సార్ చేయూత పథకాలను అందిస్తూ మా బతుకుదెరువులకు బాసట అయ్యాడు. ఇప్పటి వరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు ఇళ్లతో సహా రూ.6,48,250 మా ఉమ్మడి కుటుంబానికి లబ్ధి చేకూరింది.

జక్కు వీరయ్య సీతమ్మ, అంకాలగూడెం

మదన గోపాలునికి నవనీత సేవ



కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారికి గురువారం నవనీత(వెన్న) సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో పురోహితులు తెల్లవారుజాము నుంచి వెన్నను స్వామివారి మూలవిరాట్ విగ్రహంపై అభిషేకిస్తూ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి గో నవనీతాన్ని సమర్పించారు. అనంతరం తులసీదళ అర్చన చేసి మూలవిరాట్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పాలకవర్గ కమిటీ చైర్మన్ మద్దు గోపి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- వెంకటాద్రిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

చింతలపూడి : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు నేరుగా అందించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని వెంకటాద్రిగూడెం పంచాయతీలో మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం 170వ రోజు గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పక్కా డ్రెయిన్లు, అంతర్గత సీసీ రహదారులు నిర్మించాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి గడపగడపకు కార్యక్రమం దోహదం చేస్తోందని తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి ఆదరణ చూస్తుంటే ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ఉన్న నమ్మకం తెలుస్తోందని, వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు సీఎం వైస్ జగన్‌కు అండగా నిలిచి ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యడ్ల మోహన్‌రావు, చుండూరి నాగేశ్వరరావు, కోలా వెంకటేశ్వరరావు, జంగా రామచంద్రారెడ్డి, జి రాంబాబు, విద్యాసాగర్, పి భాస్కర్రావు, రాజారమేష్, కుప్పాల రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

ఆర్యవైశ్య జిల్లా సంఘ సభ్యుల ఎన్నిక

కామవరపుకోట : ఆర్యవైశ్య జిల్లా సభ్యులుగా మండలానికి చెందిన ఆర్యవైశ్యులు ఎంపికైనట్లు ఆర్యవైశ్య ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు కోనా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా కార్యదర్శిగా కాకి గౌతమ్, జిల్లా ఉపాధ్యక్షుడిగా చవ్వా హరీష్, అదనపు కార్యదర్శిగా వాకచర్ల పవన్, ఈసీ మెంబర్లుగా చవ్వా కిషోర్, కొత్త గుళ్ళ సుమంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. నూతన సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

తెలంగాణలో చదివే ఇద్దరు విద్యార్థులకు అమ్మ ఒడి జమ

కుక్కునూరు : తెలంగాణ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి జమైనట్టు వచ్చిన వార్తలు నిజమేనని మండలంలోని సీతారామనగరం గ్రామస్తులు వాఖ్యానించారు. గత విద్యాసంవత్సరానికి సంబంధించి సీతారామనగరం ఎంపీయూపీఎస్ పాఠశాలలో చదవని విద్యార్థుల పేర్లను పదుల సంఖ్యలో పాఠశాలలో చదువుతున్నట్టు అక్కడ విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయించినట్టు తెలుస్తుంది. ఈ విధంగా నమోదు చేయడంతో పాటు వారు రోజూ పాఠశాలకు హాజరు అవుతున్నట్టు హాజరుశాతం చూపించడంతోనే తెలంగాణ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలలో అమ్మ ఒడి జమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు విద్యార్థులకు అమ్మ ఒడి జమకాగా మిగిలిన వారికి ఈ నెల 16వ తేదీ లోపు జమచేస్తారన్న సమాచారంతో మరి కొందరు అనర్హులకు అమ్మ ఒడి జమకానుంది. ఇది ఇలా ఉండగా చైల్డ్ ఇన్ఫోడేటా ప్రకారం విద్యార్థుల పేరున జగనన్న కిట్లు, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకంలో గుడ్లు, బియ్యం సరఫరా అవుతాయి మరి అవన్ని ఏం చేశారన్నది తెలియాల్సి ఉంది. సుమారుగా 30 మంది విద్యార్థుల పేర్లు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి అవకతవకలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వాసవీమాతకు ఆషాఢపట్టి సమర్పణ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢపట్టిని గురువారం వాసవీ కిట్టి సభ్యులు సమర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో వాసవీ కిట్టిని నూతనంగా ఏర్పాటు చేశామని ఈ నేపథ్యంలో గురువారం అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు, పట్టుచీర, గాజులు, పసుపు కుంకుమలు, పువ్వులతో కూడిన ఆషాఢపట్టిని సమర్పించినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

సాయినాథునికి కిరీటం బహూకరణ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో వేంచేసియున్న శ్రీషిర్డీ సాయినాథునికి గురువారం 1 గ్రామ్ గోల్డ్ రాళ్ల కిరీటాన్ని దాత రెడ్డి రంగప్రసాద్ అందజేశారు. ఎంబీ సోషల్ క్లబ్ సీనియర్ సభ్యులు రంగప్రసాద్ స్వామివారి అలంకరణ నిమిత్తం ఈ కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కిరీటాన్ని అలంకరించారు. కార్యక్రమంలో ఎంబీ సోషల్ క్లబ్ ప్రెసిడెంట్ మల్లాది సీతారామారావు, రెడ్డి రంగప్రసాద్, మందిర చైర్మన్ బండారు పద్మారావు, కొణతం అయ్యపరావు, చౌడు ఫకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వాసవీ మాతకు ఆషాఢపట్టి సమర్పిస్తున్న వాసవీ కిట్టి సభ్యులు

ఉధృతంగా జల్లేరు వాగు

జంగారెడ్డిగూడెం రూరల్ : ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగు ఉధృతికి ఏజెన్సీ మెట్ట ప్రాంతాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉధృతంగా ప్రవహించిన వాగు సాయంత్రానికి తగ్గుముఖం పడుతూ వచ్చింది.

వరదనీరు తొలగింపు

బుట్టాయగూడెం : భారీ వర్షాలకు మండలంలోని వాడపల్లి కాలనీ సమీపంలోని రోడ్లపైకి కాల్వ నీళ్లు భారీగా వచ్చి చేరాయి. దీనితో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పరిస్థితి పరిశీలించిన వైఎస్సార్ సీపీ నాయకులు గంటసాల గాంధీ జేసీబీని ఏర్పాటు చేసి రహదారి మీదున్న నీటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చేశారు. ఇక్కడ పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాలతో ఈ పనులు చేసినట్లు గాంధీ చెప్పారు.



పట్టెన్నపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు వాగు

ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం : మండలంలోని ఇప్పలపాడు సమీపంలో గల ప్రభుత్వ, పారిశ్రామిక శిక్షణా కేంద్రం(ఐటీఐ) కళాశాలలో 2023–24 సంవత్సరానికి గానూ వివిధ కోర్సుల్లో, ట్రేడ్‌లలో చేరుటకు రెండో విడత అడ్మిషన్‌ల ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాధికారి బి. శివయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సులకు 2 సంవత్సరాల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని అన్నారు. అలాగే డీజిల్ మెకానిక్, కంప్యూటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్ కోర్సులకు సంబంధించి ఒక సంవత్సరం కాలం శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అడ్మిషన్ కాపీ ప్రింట్, విద్యార్థి ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐటీఐ కళాశాలలో అందించాలని, వివరాలకు 99590 67617, 89789 73344, 96428 02735 నంబర్‌లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బాధ్యతలు స్వీకరించిన రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ 2023–24 నూతన కార్యవర్గం గురువారం పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. రేపల్లెవాడలోని రోటరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఇన్‌స్టిలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా అయలూరి విశ్వనాథ శర్మ, ప్రధాన కార్యదర్శిగా గొలిశెట్టి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ గవర్నర్‌గా చోడి పిండి సుబ్రహ్మణ్యం, వాటర్, శానిటేషన్ విభాగానికి షేక్ అమీర్ భాష, కమ్యూనిటీ సర్వీస్‌కి మజ్జి సూరిబాబు, మద్దు గోపాలకృష్ణ, రీజనల్ సెక్రటరీగా బోనగిరి పాపారావు, స్పోర్ట్స్, రివైవల్ కో–చైర్మన్‌గా చిరువూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు అధ్యక్ష, కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించిన సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, శంకు కొండలరావులకు క్లబ్బు ఘనంగా వీడ్కోలు పలికింది. దారం సత్యరాజు ఎస్‌బీజీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : భర్త వేధింపులపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మంగకు, కొయ్యలగూడెం మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన అయినపర్తి గంగరాజుకు 10ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. వివాహ సమయంలో పసుపు, కుంకుమ, కట్నకానుకలు కింద 20 సెంట్లు భూమి ఇచ్చారు. అయితే నాలుగేళ్లగా భర్త గంగరాజు 20సెంట్లు భూమి అమ్మి తీసుకురావాలని భార్యను వేధిస్తున్నాడు. రెండేళ్ల క్రితం భూమిని తనఖా పెట్టి దపదపాలుగా రూ.3లక్షలు అప్పు తీసుకున్నాడు. దీనిపై భార్య నిలదీసి అడగ్గా ఇంకా డబ్బులు తీసుకురమ్మని వేధించడమే కాకుండా ఆమెతో గొడవపడి ఇంటి నుంచి పంపించి వేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్పందన ఫిర్యాదుపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తన కారును దౌర్జన్యంగా తీసుకువెళ్లారని మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. ఎస్సై తెలిపిన వివరాలివి. తొర్లపాటి నాగరాజుకు కారు ఉంది. స్థానికంగా ఉన్న చోళ ఫైనాన్స్‌లో కారును ఫైనాన్స్ చేసుకోగా, వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు కారును తీసుకువెళ్లిపోయారు. అయితే ఆ కారును విడిపించుకునేందుకు తుమ్మలపల్లి పాండురంగారావు అనే వ్యక్తి వద్ద రూ. 2.25లక్షలు నాగరాజు అప్పు తీసుకున్నాడు. ఇందుకుగాను రెండు ఖాళీ చెక్కులు, రెండు ప్రామిసరీ నోట్లు, ఒక స్టాంప్ పేపర్‌పై సంతకం చేసి హామీ పెట్టాడు. నాగరాజు కారును తిరిగి శ్రీరామ్ ఫైనాన్స్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రీఫైనాన్స్ చేయించి పాండురంగారావుకు బాకీ చెల్లించాడు. అతను ఇచ్చిన చెక్కులు, బాండు పేపరు, ప్రామిసరీ నోట్లు ఇవ్వమని పాండురంగారావును అడగ్గా అవి ఇవ్వకపోగా మే 21వ తేదీన అతని కారును పాండురంగారావు, తుమ్మలపల్లి ప్రదీప్ దౌర్జన్యంగా తీసుకువెళ్లారు. దీంతో మనస్థాపానికి గురై నాగరాజు లివో సిట్రిజిన్ మాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతన్ని స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేశారు. అయితే తాజాగా స్పందనలో నాగరాజు ఫిర్యాదు చేయడంతో, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల : రాళ్లకుంటలో ఒక కోడి పందేల స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న 6గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ: 4,820 నగదుతో పాటు ఒక కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.